## కథ

# కొత్త చిగురు

**- వలివేటి నాగచంద్రావతి**

వాకింగ్ ముగించుకుని వస్తున్నాను. ఆదివారమే కదా అని నాలుగడుగులు ఎక్కువ వేసేసరికి తెల్లగా తెల్లారిపోయింది. కాఫీ గుర్తుకొస్తోంది. అడుగులకి చురుకు పెరిగింది. ఇంటికి దగ్గరగా వచ్చేశాను.

మా ఇంటి కాంపౌండులోంచి సన్నపాటి కలకలం. ఏమయింది చెప్మా?

కాస్త కంగారుగా గేటు తోసుకుని లోపలికి వెళ్ళాను. గేటు కుడివైపున ప్రహరీగోడకి నాలుగ్గజాల ఇవతల వేపచెట్టూ రావిచెట్టూ కనిపిస్తున్నాయ్. వాటిచుట్టూరా సిమెంటు దిమ్మ ఉంది. దాని దగ్గర ఓ పదిమందిదాకా జనం మూగి ఉన్నారు - వింతగా చూస్తూ, భయంగా భక్తిగా మాట్లాడుకుంటూ. మా ఆవిడ సర్వమంగళ కూడా అక్కడే ఉంది.

మాది పెద్ద ఆవరణ. ఎప్పుడో మాంధాత కాలంలో మా ముత్తాత చవగ్గా వచ్చింది



కదాని ఓ వెయ్యి గజాల స్థలం కొని పడేశాడట. మా నాన్న ఆ స్థలం మధ్యలో ఓ బుల్లి పెంకుటిల్లు వేశాడు. నేనా పెంకులు ఊడదీయించి డాబా వేశాను. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే మా ఇంటి చుట్టూరా బోలెడు ఖాళీ స్థలం. కూరగాయల మొక్కలూ పూల మొక్కలూ కాక మామిడీ సపోటా లాంటి పెద్దపెద్ద చెట్లు కూడా చాలానే ఉన్నాయి.

పాతికేళ్ళక్రితం ఈ వేపమొక్కా రావిమొక్కా దగ్గర దగ్గరగా మొలవటం చూసి తెగ సంతోషపడిపోయి వాటికి పాదుచేసి నీళ్ళుపోసి పెంచి పెద్దచేసి వైభవంగా పెళ్ళి కూడా చేసి శాశ్వతంగా తిన్నె కూడా కట్టించేసింది మా అమ్మ.

ఇప్పుడు దాని దగ్గరే ఆ హడావుడి. గబగబా అటు వెళ్ళాను.

"నిన్న కూడా చూశానమ్మా. అప్పుడు ఇంత ఆకారం తేలలేదు. ఆ పడగా ఆ కళ్ళూ అచ్చంగా పాములైనే ఉందమ్మగారూ" మాకు పాల ప్యాకెట్లు తెచ్చిపెట్టే వీరేశం అంటున్నాడు.

"చుప్... నాగేంద్రుణ్ణి పట్టుకుని పామూ అదీ అన్నావంటే కళ్ళు పోతయ్. చెంపలేసుకో భడవా" మా ఎదురింటి ఆచారం పిన్నిగారు వాణ్ణి ఒక్క గదుము గదిమారు. మడీ, ఆచారం కాస్త ఎక్కువని ఆవిణ్ణలా అంటాంలెండి.

"ఎంత పుణ్యం చేసుకున్నామో... ఇలా దరిశన మిచ్చారు స్వామి" రెండు చేతులూ ఎత్తి నమస్కారం చేస్తోందావిడ.

"నిజంగా నాగదేవత మా ఇంట్లో వెలిసిందంటావా పిన్నీ?" అంటోంది మా ఆవిడ. కళ్ళు మెరిసిపోతున్నాయ్ దానికి.

నేను ఆశ్చర్యంగా ఇంకొంచెం ముందుకు వెళ్ళి చూశాను.

రావిచెట్టు మొదట్లో నుంచి ఓ కొమ్మ వంకరటింకరగా ఓ మీటరుంటుంది- ఆకూ కొమ్మా రెమ్మా లేకుండా పైకెదిగింది. చివర్లో రెండు కొమ్మలు ఎందువల్లో విడివిడిగా కాకుండా అతుక్కుపోయి పడగ ఆకారమొచ్చింది. కళ్ళ స్థానంలో రెండు బొడిపెలు. నిజంగానే తోకమీద నిలబడ్డ పాములా విచిత్రంగా ఉంది. ఈ వింత ఆకారానికి వృక్షశాస్త్రానికి సంబంధించిన ఏదో కారణం ఉండే ఉంటుంది. వీళ్ళు దాన్నికాస్తా దేవుణ్ణి చేసేస్తున్నారు.

కానీ ఇప్పుడు వీళ్ళు అలాంటి మాటలు వినిపించుకునే పరిధిలో ఉన్నారని నాకు అనిపించలేదు.

వీరేశమప్పుడే తన దగ్గర మిగిలిపోయిన పాల ప్యాకెట్ ఓ మూల చింపి ధారగా ఆ కొమ్మకి అభిషేకం చేసేస్తున్నాడు. ఆ పడే పాలని పురిసిట్లో పట్టి తీర్థంగా కళ్ళకద్దుకుని సేవిస్తున్నారు కొందరు. ఆ కింద పాలతో తడిసిన మట్టిని భక్తిగా నొసటన పెట్టుకుంటున్నారింకొందరు. ఎవరు పురమాయించారో తనకే తట్టిందో కానీ మా పక్కింటి పాప- కుందీ, దాన్లో నూనెతో సహా తెచ్చేసి వత్తి వేసి వెలిగించేసింది. దీపారాధన అయ్యాక కర్పూరం, అగరువత్తులూ రావటమెంత సేపు? ఇక హారతి పట్టడమొక్కటే తరువాయి.

ఇంకోపక్క నా ఇల్లాలు సర్వమంగళాదేవి స్థల పురాణం విప్పింది. "పిన్నీ, నువ్వు నమ్ముతావో లేదోగానీ మా అత్తగారెప్పుడూ చెబుతూ ఉండేవారు- వాళ్ళ అత్తగారి అత్తగారు ఈ స్థలం కొనేటప్పుడు ఇదంతా అడవిట. సరిగ్గా ఈ చోట్లో ఓ పెద్దపుట్ట ఉండేదట. రోజూ సూర్యోదయంవేళ నాగుపామొకటి పుట్టలోంచి బయటికొచ్చి తోకమీద నిలబడీ..." చేతులు తిప్పుతూ చెప్పేస్తోంది.

నేను నిట్టూర్చి వెనక్కి వచ్చేశాను.

అక్కడంతా సద్దుమణిగి సర్వమంగళ ఇంట్లోకొచ్చేసరికి చాలా సమయమే పట్టింది. ఆ లోపల మా పెద్దాడు చైతు- చైతన్య క్రికెటాడొచ్చి 'ఆకలి ఆకలి' అంటూ బ్యాట్‌తో సహా వీరంగం చేశాడు. ఆ ఓపిగ్గాడా లేక ఏ బిస్కట్లో కారప్పూసో దొరక్కపోతాయా అని కాబోలు డబ్బాలు వెతుకులాడాడు మా చిన్నాడు సిద్ధు- సిద్ధార్థ. తీరిగ్గా అప్పుడింట్లో కొచ్చి ఇంకో అరగంట తరవాత ఉప్మా ప్లేట్లు టేబుల్‌మీద పెట్టింది మా ఆవిడ.

హ్మ్, ఆదివారంపూట ఉప్మా!

ఆముదం తాగిన మొహాలు పెట్టారు పిల్లలు. వాళ్ళని అస్సలు పట్టించుకోకుండా అత్యంతోత్సాహంగా నావైపు చూసింది సర్వమంగళ. "నేనేం చెప్పినా చాదస్తమని తీసేస్తారుగానీ ఆ సర్పాకృతి, ఆ పడగా, ఆ కళ్ళూ... మీరూ కళ్ళారా చూశారుగా- దాన్నేమంటారు మరి? ఆచారం పిన్నిగారేమంటారంటే 'మీ తాతమ్మగారు చూసిన సర్పం సూర్యనమస్కారాలు చేస్తున్నదంటే అది దేవతా సర్పమే అయ్యుంటుందట. ఆ దైవ అంశ అప్పట్నుంచీ ఆ స్థలంలో నిక్షిప్తమై ఉండి ఇన్నాళ్ళకిలా ఈ రూపంలో సాక్షాత్కరించిందని. మన అదృష్టాన్ని ఆవిడెంతగా పొగిడారో తెలుసునా- సాక్షాత్తూ సుబ్రమణ్య

స్వామే మీ పెరట్లో కొలువుతీరారు. ఏమి భాగ్యం మీది' అని ఆవిడంటూ ఉంటే- నిజంగా చెప్తున్నాను... నాకా సమయంలో ఏదో ఆవహించినట్టు దైవ సంబంధమైన అపూర్వానందానుభూతి కలిగింది సుమండీ" అంటూ ట్రాన్స్‌లో ఉన్నట్టు కళ్ళు అరమూసి మళ్ళీ ఆ చెట్టు మొగదల విశేషం దగ్గరకు వెళ్ళిపోయింది.

"పో అమ్మా, నిజంగా నీది చాదస్తమే. ఇప్పటికిప్పుడు నన్ను చెప్పమంటే చెప్పలేను కానీ ఏ సైన్సు స్టూడెంటునో, ఏ బోటనీ స్టూడెంటునో అడిగితే అలా ఆ కొమ్మ రావటానిక్కారణం చెప్పేస్తాడు. దానికి వెలవటాలూ మాయమవటాలూ అని నువ్వు కొత్తరంగు అద్దకు" పచ్చిమిరప ముక్కలూ, పోపుగింజలూ తప్ప మరేమీ కనిపించని ఆ నిస్సారపు ఉప్మా తినలేక తింటూ అసలే విసుగ్గా ఉన్నాడేమో మా చైతు విసుక్కున్నాడు.

"నోరు ముయ్యరా. దైవానిగ్గూడా ఎక్స్‌రే తియ్యాలంటావ్ నువ్వు. వెధవ వికటవాదమూ నువ్వూనూ. కొమ్మలకి ఆకుల్లేకుండా కళ్ళూ పడగలూ ఉంటాయని ఏ సైన్సురా చెప్పింది?" గదమాయించింది మా ఆవిడ.

"ఉండు ఉండమ్మా. ఆకుల సంగతి నేను చెబుతా" పెద్దగా అరిచినట్టన్నాడు సిద్ధు.

ఉలిక్కిపడి చూశాం. "మొన్న నేనూ, రఘుగాడూ ఆ చెట్టు దగ్గర గట్టుమీద కూర్చుని గాలిపటాలు కట్టుకున్నాం కదా. రఘుగాడా కొమ్మచివర్న బోడి పెల మీదున్న ఆకులన్నీ గిల్లేశాడు. ఇదిప్పుడు మాయలపకీరు మంత్రదండంలా ఉంది కదరా అన్నాడు కూడా" పజిల్ పూర్తిచేసినట్టుగా అన్నాడు సిద్ధు.

"పోరా వెధవా. నువ్వేం చెబితే అది నమ్మటానికి నేనేం పిచ్చిదాన్ననుకున్నావా? నమ్మను. చచ్చినా నమ్మను. అసలు అంత పెద్దావిడ అబద్ధం చెబుతారా... ఎంత అనుభవంతో చెప్పారో ఆవిడ. ఆ మాటే నమ్ముతాను నేను. మన ఇంట్లో నాగేంద్రుడు వెలిశాడు అంతే!" సర్వమంగళ కారప్పొడిలో నెయ్యి వంచుకుంటున్న వాడి చేతిలోంచి నేతిగిన్నె విసురుగా లాక్కుని విసవిసా వెళ్ళిపోయిందక్కణ్నుంచి.

పిల్లలు గప్‌చుప్. నేను మళ్ళీ నిట్టూర్చి కామ్‌గా హాల్లోకొచ్చి పేపరు చేతికి తీసుకున్నాను.

★ ★ ★

సెలవురోజయితే మధ్యాహ్న భోజన మయ్యాక పడక్కుర్చీలో వాలి భుక్తాయాసం తీర్చుకోవటం అలవాటు. పడక్కుర్చీలో కునుకు రసవత్తరంగా ఉంటుంది. సాధార ణంగా సాయంత్రం మా ఆవిడ టీకప్పు



పట్టుకొచ్చి లేపేదాకా ఆ సుఖం చెదరదు.

ఈరోజలా కాలేదు. ఎవరో "అమ్మా, అమ్మగారూ" అంటూ కేకమీద కేక పెడు తోంటే ఆ అరుపులకి తప్పనిసరిగా కళ్ళు తెరవాల్సొచ్చింది. వంటింట్లో టీ పెడుతోన్న సర్వమంగళ కూడా పరిగెత్తుకొచ్చింది.

వీధిగుమ్మం బయట చేతిలో పాలచెంబుతో నిలబడున్నాడొకతను. పొద్దుట చెట్టు దగ్గర గుంపులో చూశా నతన్ని. ఎందుకోగానీ అతని మొహం విప్పారి ఉంది అనిపించింది.

"నన్ను కనకారావంటారమ్మా" మా ఆవిణ్ణి చూసి పాలచెంబుతో సహా చేతులు జోడించాడతను.

మా రోడ్డు చివర రేకులషెడ్డట వాళ్ళది. ఆటో డ్రైవరతను. కూతురికి నిన్నట్నించీ కాన్పునొప్పులు. తొలిచూలు. పొద్దుట చెట్టు దగ్గరకొచ్చినప్పుడు దణ్ణం పెట్టుకుని తడిచిన మట్టి పట్టుకెళ్ళి కూతురి నుదుటన పెట్టాట్ట. గంటకల్లా ప్రసవించిందట. మగపిల్లవాడు.

"రావిచెట్టు నాగన్న గొప్ప మహిమగల వాడమ్మా. ఇట్టా మొక్కుకు వెళ్ళానో లేదో అట్టా నా బిడ్డ బరువు దింపాడు. అడక్కుండానే మేనూశపట్ల మగ నలుసుని ప్రసాదించాడు. తల్లి తల్లి... వెంటనే వచ్చి పాలు పోస్తానని అనుకున్నానమ్మా. మీరనుమతిస్తే..." ప్రాధేయ పూర్వకంగా అడుగుతున్నాడతను.

వంద క్యాండిల్స్ బల్బులా వెలిగింది మా సర్వమంగళ వదనారవిందం. నావైపో విలక్షణమైన చూపు విసిరి "అయ్యో, దానికేం భాగ్యం. మొక్కు తీర్చుకుంటానంటే కాదంటామా? వెళ్ళు. వెళ్ళి అభిషేకం చేసుకో" అంది ఉదారంగా వరమిచ్చినట్టు.

ఈ వార్తెలా పొక్కిందో తెలీదు. సాయంత్రానికి మరో ఏడెనిమిది మంది పాలు పోశారు. ఒకరిద్దరు కొబ్బరికాయలు కొట్టారు. హారతి కూడా ఇచ్చే ఉంటారు.

నాకు మతిపోతోంది - ఈ వెర్రి ఎక్కడి వరకూ వెడుతుందోనని. అనుకోకుండా ఆ రాత్రికే- ఇదంతా ఎటు దారి తీయనుందో నా కళ్ళకు కట్టింది.

★ ★ ★

భోజనాలయి వక్కపలుకు నవుల్తూ టీవీ ముందు కూర్చున్నప్పుడొచ్చాడు వీరేశం.

"ఏమిలా వచ్చావ్?" అడిగింది మా ఆవిడ.

"మరేంలేదమ్మా" చేతులు నలుపుకుంటు న్నాడు వాడు.

"అడ్వాన్సా?"

"అహహ... అందుగ్గాదమ్మా. మా చిన్నోడు దాసు పనేమీ దొరక్క ఖాళీగా ఈగలు తోలుకుంటూ ఉన్నాడు. ఇంట్లో ఉన్నోళ్ళం నలుగురం నాలుగు రూకలు తేకపోతే ఈ సంసారంబండి నడిచే బతుకులు కావు మావని మీకూ తెలుసునుగదా అమ్మా."

దేనికోసమీ ఉపోద్ఘాతం. చప్పున తేలిస్తే బావుండును. పగలంతా మా ఆవిడ సీరియల్స్. పిల్లలకేమో సెలవొచ్చిందంటే గ్యాప్ లేకుండా కార్టూన్ చానల్స్. కనీసం ఈ వేళప్పుడయినా డిస్టర్బెన్స్ లేకుండా కాసేపు టీవీలో వార్తలు చూడనివ్వరు గదా ఇలాంటివాళ్ళొచ్చి.

"మరే" అంది మా సర్వమంగళ అయోమయంగా.

"అందుకేనమ్మా తమతో మనవి చేసుకుందామనొచ్చాను. మీరు నాయందు దయ ఉంచి 'ఊ' అన్నారంటే ఓ పాల చెంబిచ్చి మా దాసుని ఆ నాగన్న చెట్టుకాడ కూచుండబెడతాను" అన్నాడు వీరేశం ఆశగా చూస్తూ.

"ఎందుకు?" అన్నాను విస్మయంగా. టీవీలో వినిపిస్తోన్న వార్తల సంగతీ, జరుగు


## కలం కదిలించండి

సృజనాత్మకత కలిగిన రచయితలకూ రచయిత్రులకూ ఇదే ఆహ్వానం. మానవ జీవితంలోని విభిన్న పార్శ్వాలను స్పృశిస్తూ, మధురమైన అనుభూతులను పాఠకులకు పంచే కథ లకు 'ఈనాడు' స్వాగతం పలుకు తోంది. భావం ఏదైనా... కథనంలో వైవిధ్యం, పాఠకులను ఏకబిగిన చదివిం చగలిగే బిగువూ ఉండాలి. ఆశావహ దృక్పథంతో సాగే కథలకు ప్రాధాన్యం. కథ సాధారణ చేతి రాతలో ఏడు అర రావులకు మించకూడదు.

కథలు పంపాల్సిన చిరునామా:

ఆదివారం అనుబంధం
ఈనాడు కాంప్లెక్స్, సోమాజిగూడ, హైదరాబాద్-82.

తోన్న సంభాషణంతా మా ఆవిడతోనే అన్న సంగతీ కూడా మరిచిపోయి.

"అలా అడుగుతారేంటి బాబూ. నాగన్నకి పాలు పోయటానికి జనం వస్తున్నారా- అహ- ఈవేళ పదిమందే అనుకోండి- రేపు పాతికమంది అవరా. ఇట్లానే ఆ అంకె పెరుగుద్ది కదా. వచ్చినోళ్ళు ఆవు పాలకోసం ఎందుకు తడుముకోవాల... దొరక్కపోతే ఎందుకు నిరాశపడాలా? అందుకన్నమాట ఈ ఏర్పాటు. అళ్ళకా ఇబ్బందీ తప్పుతుంది. మా ఓడికి కాసింత పనీ దొరుకుద్ది. అది తల్లీ నా యోచన" అన్నాడు వీరేశం మా ఇద్దరి వంకా మార్చిమార్చి చూస్తూ.

"నీకసలు అన్ని ఆవుపాలెక్కడివిరా?" సర్వమంగళ అనుమానంగా అడిగింది.

"బోండమ్మా, మరీ అమాయకంగా మాటాడతారూ. బర్రెపాలలోనే కాసింత పసుపు కలిపితే సరీ" నవ్వుతూ అన్నాడు వీరేశం.

'ఔరా మనుషులెంత తెలివిమీరిపోయారూ' నోటమాట రాలేదు నాకు.

"సరేలే, రేపు పాల ప్యాకెట్లు తెస్తావుగా. ఏ సంగతీ అప్పుడు చెబుతాను" అంటోంది సర్వమంగళ మాటలు తుంచేసి.

"కాదనకండమ్మా. నాకేం లాభమూ అనుకోమాకండి. రోజూ మీకు సరిపడా పాలు పోసేస్తుంటా- సరా?"

ఊగిసలాడే మనసుని లొంగదీసే కిటుకు ప్రయోగించాడు - తిరుగులేదను కుంటా దానికి.

"రేపు చెబుతానన్నా కదా. మేమూ ఆలోచించుకోవాలిగా" బింకం చూపించింది మా ఆవిడ.

"ఏం చేస్తారోనమ్మా మీదే భారం" వీరేశం అందరికీ దణ్ణాలు పెడుతూ వెళ్ళాడు.

వాడు వెళ్ళాడు. మా సభలో సమాలోచనలు మొదలయ్యాయి. మా వాళ్ళలో అప్పటి వరకూ అదిమిపెట్టుకున్న ఉత్సాహం ఉబికి ఉబికి వచ్చింది.

"వావ్ అమ్మా, రేపట్నుంచీ మాకు రెండుపూటలా గట్టిపెరుగు వెయ్యాల్సిందే. రోజూ స్వీటో, పాయసమో చేసిపెట్టాలి. సరే అను" చైతు వీరేశం ప్రతిపాదనని ఏ బిల్లూ ఏ చర్చా లేకుండా ఏకపక్షంగా ఆమోదించేశాడు.

"నాకు ముందు పాలకోవా చేసి పెట్టాలి" కోరుకోటంలో తనెక్కడ వెనకపడిపోతానో అని వాళ్ళ అమ్మ ముందుకువచ్చి చేతులు పట్టుకు ఊపుతూ మరీ తన కోరికని లిస్టులో చేర్చాడు సిద్ధూ.

"నెలకి మూడు నాలుగువేలు ఆదా". గృహిణిగా తన ఆనందాన్నీ, తృప్తినీ వ్యక్తంచేసింది సర్వమంగళ.

"అమ్మా, నాకింకో గుడ్డైడియా వచ్చింది చెప్పనా?" చిటికవేస్తూ అడిగాడు చైతు. కానీ అనుమతి కోసం ఆగలేదు. "ఆవు పాలతోపాటు కొబ్బరికాయలూ అగరొత్తులూ లాంటి పూజ సామగ్రి కూడా ఇంకెవరితో నయినా అమ్మకానికి పెట్టిస్తేనో - లాభాల్లో వాటా అడగొచ్చు. పెట్టుకున్న జాగాకి రెంట్ కూడా తీసుకోవచ్చు. ఏమంటావ్?" అడిగాడు హుషారుగా.

ఆహా, వీణ్ణి దేశానికి ఆర్థికబలం చేకూర్చాల్సిన శాఖలో పెడితే అద్భుతంగా సరిపోతాడు. ఆశ్చర్యం... వీడేనా విచిత్రంగా లేచిన ఆ కొమ్మకి బొటానికల్ రీజన్ ఉంటుందన్నది?

"ఓరి నీ ఇల్లు బంగారంగానూ... ఏమి బుర్రరా నీదీ. మంచి పథకమే సుమా" మెచ్చుకుంది మా ఆవిడ.

"ఎవరో ఎందుకూ- ఆ వీరేశం పెళ్ళామే ఉంది. ఆకుకూరల గంప నెత్తికెత్తుకుని ఇళ్ళ దగ్గరకొచ్చి అమ్ముకుంటూంటుంది. వీధులు తిరక్కుండా ఓచోట కూర్చుని ఈ వ్యాపారం చూసుకోవే అంటే మహా



రాణిలా ఒప్పుకుంటుంది. లాభాల్నిబట్టి మనమూ రేటు పెంచొచ్చును" అంది.

లోలోపల అంచనాలు వేస్తున్నట్టే ఉంది.

నేను మాత్రం తీసిపోయానా అని గావును మా సిద్ధూ అందుకున్నాడు. "అమ్మా, మనమో పూజారిని ఆరేంజ్ చేద్దాం. నువ్వు చెబుతూ ఉంటావే... సంకల్పం, గోత్రనామాలూ, అష్టోత్తరం అదీ ఇదీ అనీ. అవన్నీ కూడా జరిగేట్లు చూశామంటే బోలెడు డబ్బు" అంటూ.

'ఇదీ బాగానే ఉంది.' ఎప్పుడూ తమ్ముడి మాటని గడ్డిపోచలా తీసిపడేసే చైతు ఈవేళెందుకో చాలా విలువే ఇచ్చాడు. "అమ్మోయ్, నువ్వు చాలా జాగ్రత్తగా వాచ్ చేస్తుండాలి సుమా. ఒక్కోసారి గొప్పగొప్ప కానుకలు కూడా పళ్ళెంలో పడుతూ ఉంటయ్" అంటూ తల్లిని హెచ్చరించి, "మెల్లగా చందాలు వసూలు చేసి, మండపం కట్టిద్దాం" గొంతు తగ్గించి "ఇంకోమాటమ్మా, ఆ పాము తలమీద ఆకులవీ రాకుండా చూసుకుంటుంటుండాలి. మళ్ళీనేమో..."

ఒళ్ళు మండిపోతోంది నాకు. వినగా వినగా ఓపిక నశించిపోతోంది. "నోరు ముయ్యండిరా. మీకేమన్నా బుద్ధుందా? వాళ్ళేదో అమాయకంగా, అజ్ఞానంగా తలా తోకా లేకుండా ఓ కథ కల్పిస్తే, మీరు ఆ ఆధారంలేని పునాదుల మీద మేడలు కట్టేసి కాసులు రాల్చుకుందామని చూస్తున్నారా. శభాష్" అన్నాను అసహనంగా.

సర్వమంగళ మూతి మూడు వంకరలు తిప్పింది. "హ్హు, మీరు మా మాటలకెప్పుడు ఔనన్నారులెండి. అంతా ఎతి మతమే కదా. సర్లెండి. రేపు ఆ నాగన్న దగ్గర జనాలు 'క్యూ' కట్టినప్పుడు తెలుస్తుంది."

టీవీ కట్టేసి లేచిపోయారందరూ.

★ ★ ★

వాకింగ్‌కి వెళ్ళే వేళకి అలవాటుగా మెలకువ వచ్చింది. స్టిక్ తీసుకుని గేటు వరకూ వచ్చాను. అప్రయత్నంగా చూపులు రావిచెట్టు వైపు మళ్ళాయి. విడీవిడని చీకట్లు. ఏ ఆకారంలోనూ స్పష్టత లేదు. రాజకుమారుణ్ణి దక్షిణం వైపు గదికి వెళ్ళవద్దంటే అటుగానే మనసు లాగినట్టు నా అడుగులు అటువైపుగా పడినయ్. రావిచెట్టు ఎదురుగా, వెర్రితలవేసిన ఆ కొమ్మకి దగ్గరగా నిలబడ్డాను.

రాత్రి మావాళ్ళ సంభాషణ గుర్తుకొచ్చింది. నాలుగురోజులు ఎవరూ చూడకుండా ఉండుంటే కొమ్మ ముదిరి పైన ఆకులు వేసి, పెద్ద చెట్టులో కలిసిపోయుండే లేకపోతే వేరుమొక్కగా ఎండిపోయుండే ఆ కొమ్మ దర్శనానికి 'క్యూ'నా. పాలాభిషేకం, పూజలూ, అష్టోత్తరాలూనా?

ఇంత ఆర్భాటం అవసరమా. ఇదంతా అబద్ధమని తేలిపోతేనో- ఇంకో కథ అల్లుతారా? ఉహూ, ఈ కపట నాటకాన్ని సాగనివ్వను.

నాకు ఉద్రేకం ఆగలేదు. ఒకడుగు ముందుకు వేశాను. చేత్తో ఆ కొమ్మని గట్టిగా పట్టుకుని వంచి ఒక్కలాగు లాగాను. విరిగి చేతిలోకొచ్చిన ఆ కొమ్మని పక్కనే ఉన్న ముళ్ళగోరింట పొదల్లోకి గిరాటేశాను. కామ్‌గా కాళ్ళు ముందుకు కదిపాను.

★ ★ ★

ఆ తరవాత రేగిన కల్లోలం, అయిన గందరగోళం మాటల్లో చెప్పలేను.

వారం తరవాత యథాప్రకారం వాకింగ్‌కి వెళ్ళి తిరిగి వచ్చేటప్పుడు యథాలాపంగా రావిచెట్టు వైపుకి చూశాను. ఆ కొమ్మ విరిగినచోట ఆరోగ్యకరమైన ఆకు పచ్చని ఆకులు, పైన ఎర్రని చిగుర్లతో చిన్నచిన్న రెమ్మలు.

నా మనసు ఆనందంతో నిండిపోయింది. ★